

ఆడామగ అంతా సమానమే

- ఆడపిల్లలపై వివక్ష విడనాడాలి
- నిరంతర శ్రమజీవి మహిళ
- 'సాక్షి' టాక్‌షోలో విద్యార్థినుల మనోగతం



మంచిర్యాలఅర్బన్‌: 'ఆడపిల్లలనే భారంగా భా విస్తున్నారు. అమ్మ కడుపులో నుంచి మొదలుకు ని ఇంటా బయట ఏదో రకంగా వివక్షకు గురవుతూనే ఉన్నారు. ఆడామగ అంతా సమానమే.. ఆడపిల్లలు బాగా చదువుకోవడానికి ప్రోత్సహించాలి. చదువుకుని ఉద్యోగాలు చేస్తూ తమ కాళ్లపై తాము నిలబడడం వల్ల వివక్ష దూరమవుతుంది. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొం టూ.. ఆకతాయిల నుంచి రక్షించుకునేందుకు స్వీయ మెలకువలు నేర్చుకోవాలి..' అంటూ మంచిర్యా ల పట్టణంలోని శ్రీహర్ష డిగ్రీ కళాశాల విద్యార్థినులు అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో 'సాక్షి' టాక్‌షో నిర్వహించింది. సెక్టోరల్‌ అధికారి యశోధర ముఖ్య అతిథిగా హాజరై మా ట్లాడుతూ ఆడపిల్ల అంటే తక్కువేమీ కాదని, ఆ యా రంగాల్లో రాణించాలన్న తపన, అపజయాలకు కుంగిపోకుండా విజయం సాధించాలని అ న్నారు. విద్యార్థినుల మనోగతం వారి మాటల్లోనే..

అమ్మ కడుపులో నుంచి వివక్ష



ఆడపిల్ల అనగానే అమ్మ కడుపులో నుంచి వివక్ష మొదలవుతుంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతీచోట ఏదో రూపంలో వివక్ష కొనసాగుతూనే ఉంది. చదువుకునే దగ్గర నుంచి ఉద్యోగాల వరకు ఎదురయ్యే ఇబ్బందులను తట్టుకుని నిలబడాలి. మానసిక ఒత్తిడి.. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కావు. అన్నింటినీ ఎదురించి నిలబడాలి. – శిరీష, డిగ్రీ విద్యార్థిని

ఆడవాళ్లంటే బలహీనులు కాదు..

ఆకతాయిల నుంచి స్వీయరక్షణకు మెలవకులు, కరాటే నేర్చుకోవాలి. ఆడపిల్లలు అన్ని రంగాల్లో తమదైన ముద్ర వేస్తున్నారు. సమాజంలో తరతరాలుగా ఆడపిల్లలపై వివక్ష కొనసాగుతూ వస్తోంది. మగవారి కంటే తక్కువ, బలహీనులు అనే భావన ఉంది. వివక్ష పూర్తిగా తొలగాలంటే బాగా చదవాలి. ఉద్యోగాలు చేయడం ద్వారా వివక్ష తగ్గిపోతుంది. – నఫీజా తయబా, బీజెడ్సీ విద్యార్థిని

నిరంతర శ్రమజీవి ఆడవాళ్లే..

ఆడపిల్ల అనగానే కుటుంబ భారంగా మారిపోయింది. బాల్యవివాహాలు అరికట్టడం, ఆడపిల్ల లపై వివక్ష రూపుమాపాలి. పుట్టిన దగ్గర నుంచి చచ్చేదాకా ఏ దశలో కూడా విరామం లేకుండా పనిచేసే ఏకైక శ్రమజీవి ఆడవాళ్లే. చదువుకున్న మహిళలు ఉద్యోగాలకు వెళ్తే.. గ్రామీణ ప్రాంత మహిళలు వ్యవసాయ పనులు చేస్తూ జీవితకాలం పోరాటం చేస్తున్నారు. భవిష్యత్‌ తరాలు మనుగడ సాగించాలంటే ఆడపిల్ల పుట్టనిద్దాం.. వారిని ఎదగనిద్దాం.

– యశోధర, సెక్టోరల్‌ అధికారి, మంచిర్యాల

ఆన్‌లైన్‌తో మోసపోతున్నారు..



సోషల్‌ మీడియాతోనే ఆడపిల్ల ల పట్ల మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎవరో ముక్కుమొఖం తెలియని వ్యక్తులు ఫ్రెండ్‌ రిక్వెస్ట్‌ పంపగానే ఏదీ చూడకుండా ఓకే చెప్పడం.. ఆ తర్వాత ఏం జరుగుతుందో చూస్తున్నాం. ఏది పడితే అది చూడకుండా, మంచి చెడులు గుర్తించి మంచిని మాత్రమే స్వీకరించాలి. అశ్లీల వెబ్‌సైట్‌లను నిషేధించాలి. మగపిల్లల తల్లిదండ్రులు ఆడపిల్లలను ఎలా గౌరవించాలో నేర్పించాలి.

– భూమిక, బీకాం విద్యార్థిని



'సాక్షి' టాక్‌షోలో పాల్గొన్న విద్యార్థినులు



మాట్లాడుతున్న సెక్టోరల్‌ అధికారి యశోధర

పాఠ్యాంశాల్లో చేర్చాలి



పిల్లలకు చిన్నప్పటి నుంచి విలువలతో కూడిన విద్యాబోధన సాగాలి. ఎన్ని కఠిన చట్టాలున్నా మహిళలను కాపాడడంలో విఫలమవుతున్నాయి. పురుషుని బాల్య దశలోనే స్త్రీ అంటే గౌరవ భావం రావాలంటే పాఠ్యాంశాల్లో చేర్చాలి. మహిళల సంక్షేమ చట్టాలు, అమలు తీరుపై భయంతో కూడిన అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు ఆడపిల్లల పట్ల చిన్నచూపు చూడకుండా మగవాళ్లతో సమానంగా చదువు చెప్పించాలి. – సావ్య, డాటా సైన్స్‌ విద్యార్థిని

బాధ్యతగా వ్యవహరించాలి



ఆడపిల్లల పట్ల వివక్ష రూపుమాపాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించి కంకణబద్ధులు కావాలి. ఆడపిల్లలు పాఠశాలకు వెళ్లాలంటే ఆకతాయిల బెడద, కళాశాలకు వెళ్తే ర్యాగింగ్‌లు ఇలా ఏదో రూపంలో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల నుంచి కళాశాలలో విద్యార్థులకు చట్టాలతోపాటు ప్రతీ అంశంపై చర్చించేంత అవగాహన ఉండాలి. బాల్యవివాహాలు అరికట్టాలి. – మానస, విద్యార్థిని

మహిళలను గౌరవించాలి



సమాజంలో మహిళలను గౌరవించాలి. ఆడపిల్లలను మహాలక్ష్మితో పోల్చుతున్న దేశంలో ఇంకా మగబిడ్డలకు వెంపర్లాడుతున్నా కుటుంబాలు ఉన్నాయి. శాస్త్రీయత, టెక్నాలజీలు పెరిగి ఆడవాళ్లు రాణిస్తుంటే ఇంకా ఆడపిల్లలపై వివక్ష ఎందుకు చూపుతున్నారో అర్థం కాకుండా పోతోంది. ఆడపిల్లలు లక్ష్యసాధనకు తల్లిదండ్రుల అభిప్రాయాలతో ముందుకు సాగితే మంచి భవిష్యత్‌ ఉంటుంది. – రజిత, అధ్యాపకురాలు

శంభో శంకర



జైపూర్‌: మహా శివరాత్రి పర్వదినానికి జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. జైపూర్‌ మండలం వేలాలో మూడు రోజులపాటు జాతర నిర్వహించనున్నారు. జాతరకు మంచిర్యాల, చెన్నూర్‌, గోదావరిఖని, కాళేశ్వరం, భూపాలపల్లి, మంథని డిపోల నుంచి వందకు పైగా ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నారు. మంచిర్యాల నుంచి పెద్దవాళ్లకి రూ.70, చిన్న పిల్లలకు రూ.40 చార్జీ ఉంటుందని ఆర్టీసీ డీఎం వి.రవీంద్రనాథ్‌ తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందని పేర్కొన్నారు. భక్తుల రద్దీని బట్టి వేలాల జాతరకు మరిన్ని బస్సులను కేటాయించే అవకాశాలున్నాయి.

వేధింపులపై మౌనమే..!

- ఇళ్లలో చెప్పేందుకు వెనుకంజ
- కఠినంగా శిక్షిస్తేనే మహిళలకు భద్రత
- సర్వేలో మహిళల వెల్లడి

మంచిర్యాలక్రైం: సృష్టికి మూలమైన మహిళకు రక్షణ కరువైంది. విద్య, ఉద్యోగం కోసం బయట అడుగుపెట్టిన మహిళ ఏదో ఒకచోట వేధింపులకు గురవుతోంది. ఈవ్‌టీజింగ్‌పై కొందరు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం, ఎదుర్కోవడం చేస్తుండగా చాలామంది మౌనంగా ఉండిపోతున్నారని 'సాక్షి' నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. వేధింపులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈవ్‌టీజింగ్‌, ఫిర్యాదులపై మహిళా దినోత్సవం నేపథ్యంలో 'సాక్షి' ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసుశాఖ, అటవీశాఖలో పని చేస్తున్న మహిళా అధికారులు వంద మందితో సర్వే నిర్వహించింది.

మీరు ఎప్పుడైనా ఈవ్‌ టీజింగ్‌కు గురయ్యారా..?	
కాలేదు	65
అయ్యాము	35
టీజింగ్‌పై పోలీస్‌, షీ టీమ్‌ లేదా తల్లిదండ్రులకు చెప్పారా..?	
చెప్పాము	25
చెప్పలేదు	40
కాలేదు	35
ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకున్నారా..?	
తీసుకున్నారు	35
తీసుకోలేదు	25
కౌన్సెలింగ్‌ ఇచ్చారు	40
ఎలాంటి చర్యలు తీసుకుంటే ఆడవారికి మరింత భద్రత ఉంటుందని భావిస్తున్నారు..?	
శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి	55
మార్పు కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి	23
చట్టాలు కఠినం అమలు చేయాలి	22

అన్నింట్లో సమానంగా..



పోలీస్‌ ఉద్యోగం అంటే ఒకప్పుడు మగవాళ్లే చేసేవారు. మహిళలకు అవకాశమే లేకుండే. ప్రభుత్వాలు మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించి అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించడంతో పోలీస్‌ ఉద్యోగాలపై దృష్టి సారిస్తున్నారు. పోలీస్‌ ఉద్యోగమంటే మహిళలకు గౌరవం, ఇతరులకు సేవ చేసే అవకాశం ఉంటుంది. మహిళలు ధైర్యంగా ముందుకు రావాలి. మహిళగా యూనిఫాం సర్వీస్‌లో పని చేయడం గర్వంగా ఉంది. పురుషులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నాం.

– హైమా, షీ టీమ్‌ ఎస్సై, మంచిర్యాల

అద్భుతాలు సృష్టించగలరు



ఆడవాళ్లు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మహిళలు ఇది చేయలేరు అనే పదానికి చోటు లేకుండా అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఒకప్పుడు మహిళలకు ఎక్కడా అవకాశమే లేకుండే. ఇప్పుడు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రాణిస్తున్నారు. 73మంది వివిధ హోదాల్లో పురుషులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నాం. ఎక్కడో కొంత మహిళ కదా అనే వివక్ష ఇంకా కొనసాగుతోంది.

– కే.ప్రేమలత, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాల

గొప్పతనాన్ని గుర్తించాలి..



మహిళల గొప్పతనాన్ని పురుషులు గుర్తించాలి. ఏడాదికోసారి మహిళా దినోత్సవం రోజు మాత్రమే మహిళలు గుర్తుకు వస్తారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. గతంతో అటవీ శాఖలో ఉండేవారు కాదు. ఇప్పుడు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ ఫోర్స్‌, పోలీస్‌ రంగాల్లో రాణిస్తున్నారు. అటవీ సంరక్షణలో సైతం మహిళలు పురుషులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారు. పురుషుల్లో పురుషాహంకారం తగ్గాలి.

– కే.రమాదేవి, ఎఫ్‌ఆర్‌ఓ, ఫ్లైయింగ్‌ స్క్వాడ్‌, మంచిర్యాల

న్యూస్‌రీల్‌

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ బి.సంతోష్‌

మంచిర్యాలఅగ్రికల్చర్‌: రానున్న పార్లమెంటు ఎన్నికలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సాగేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ బి.సంతోష్‌ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మంచిర్యాల, చెన్నూర్‌ రిటర్నింగ్‌ అధికారులు రాములు, డి.చంద్రకళతో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంటు ఎన్నికల నిర్వహణ, పోలింగ్‌ కేంద్రాల హేతుబద్ధీకరణ, పోలింగ్‌ కేంద్రాల పేరు, ప్రదేశం మార్పు, తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల తహసీల్దార్‌ శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పని కల్పించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్‌: ఉపాధి హామీ పథకం కూలీలకు వంద శాతం పని కల్పించాలని జిల్లా కలెక్టర్‌ బి.సంతోష్‌ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్‌ రాహుల్‌, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్‌, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్యతో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలో సీసీ రోడ్లకు సంబంధించి 533 పనులు మంజూరు కాగా 396 పనులు ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు 1,42,498 యూనిఫామ్‌లు అందించడం లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఈ నెల 31 వరకు ఎస్‌హెచ్‌జీలకు పాఠశాలల కేటాయింపు, విద్యార్థుల కొలతల సేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు.

వంద రోజుల పనిదినాలు

జైపూర్‌: ఉపాధి హామీ పథకం ప్రతీ కూలీకి వంద రోజుల పనిదినాలు కల్పించాలని కలెక్టర్‌ సంతోష్‌ తెలిపారు. మండలంలోని ముదిగుంటలో ఉపాధి హామీ పనులను గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి దత్తుతో కలిసి కలెక్టర్‌ పరిశీలించారు. జైపూర్‌ తహసీల్దార్‌ కార్యాలయం నుంచి నిర్వహించిన ఓటు హక్కు అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. తహసీల్దార్‌ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్‌ పాల్గొన్నారు.

ఆమెకు ప్రాతినిధ్యమేది..?

- చట్టసభల్లో మహిళలు అంతంతే
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలుగా తక్కువే
- రాజకీయాల్లో ఉన్నా పదవులు అందని ద్రాక్షే
- 33శాతం మహిళా కోటా అమలైతేనే ఊరట



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అన్నింటా ఆమె సగం అనే మాటలు చట్టసభల అవకాశాల్లో అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. కీలకమైన శాసనసభ, శాసన మండలి, లోక్‌సభ, రాజ్యసభల్లో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం అసమానతను తెలియజేస్తోంది. ఉమ్మడి జిల్లా జనాభా, ఓటర్ల పరంగా చూస్తే మగవారితో సమానంగా.. ఇంకా సరిగ్గా చెప్పాలంటే కొన్ని చోట్ల మహిళలే అధికంగా ఉన్నారు. కానీ చట్టసభలకు ఆమడదూరంలో ఉన్నారు. రాజకీయ పార్టీలు సైతం మహిళలకు టికెట్లు ఇచ్చి ప్రోత్సహించడమే కరువైంది.

అందని అవకాశాలు..

73ఏళ్ల ఎన్నికల గణాంకాలు పరిశీలిస్తే ఉమ్మడి జిల్లా పది అసెంబ్లీ స్థానాల్లో ప్రతీ ఐదేళ్లకోసారి సగటున 15మంది చొప్పున సుమారు 150పైగా మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో మొత్తంగా ఏడుగురే మహిళా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో ముగ్గురు రెండు సార్లు గెలిచారు. ఇక పెద్దపల్లి, ఆదిలాబాద్‌ లోక్‌సభ నియోజకవర్గాల్లో 36మంది ఎంపీలుగా ఎన్నికయ్యారు. 1998, 1999 ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున డాక్టర్‌ సుగుణకుమారి ఎంపీగా ఎన్నికయ్యారు. మిగతా ఏ ఒక్కరికి అవకాశం దక్కలేదు. ఆదిలాబాద్‌ లోక్‌సభ స్థానం నుంచి మహిళలెవరూ ఎన్నిక కాలేదు.

33శాతం కోటా అమలైతే

గత సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో 33శాతం సీట్లు మహిళలకు రిజర్వు చేసే 128వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెడితే పార్లమెంట్‌లో ఆమోదం పొందింది. ఈ చట్టం అమలులోకి వస్తే ఇప్పుడున్న పది స్థానాల్లో కనీసం రెండు నుంచి మూడు స్థానాల వరకు మహిళలకే దక్కనున్నాయి. ఎస్సీ, ఎస్టీ స్థానాలు పోను ఒకటో జనరల్‌ స్థానం ఉండనుంది. భవిష్యత్తులో మహిళా నాయకులకు అవకాశం మెరుగుపడనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో స్త్రీ-పురుష ఓటర్లు

నియోజక వర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్‌	మొత్తం
సిర్పూర్‌	1,14,484	1,14,359	12	2,28,855
చెన్నూర్‌	95,974	97,264	07	1,93,245
బెల్లంపల్లి	86,802	88,530	13	1,75,345
మంచిర్యాల	1,38,472	1,40,559	25	2,79,056
ఆసిఫాబాద్‌	1,12,510	1,14,056	16	2,26,582
ఖానాపూర్‌	1,09,508	1,14,445	13	2,23,966
ఆదిలాబాద్‌	1,19,154	1,24,375	06	2,43,535
బోథ్‌	1,02,333	1,08,580	02	2,10,915
నిర్మల్‌	1,21,070	1,35,057	20	2,56,147
ముథోల్‌	1,23,208	1,30,378	18	2,53,604
మొత్తం	11,23,515	11,67,603	132	22,91,250

అవకాశాలు ఇవ్వాలి



రాజకీయంగా ఎంతోమంది మహిళలు కష్టపడుతున్నా వారికి తగిన అవకాశాలు రావడం లేదు. డబ్బు, హోదా ఉన్న మగవారి ఆధిపత్య ధోరణి ఇంకా కొనసాగుతోంది. ఈ పరిస్థితి మారాలి. ప్రస్తుత కాంగ్రెస్‌ సర్కారు మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, చట్టసభల్లోనూ అవకాశాలు కల్పిస్తుందనే భరోసా ఉంది.

– రామిళ్ల రాధిక, కాంగ్రెస్‌ నాయకురాలు

మహిళా బిల్లుతో మేలు



భవిష్యత్‌లో మహిళా బిల్లుతో చట్టసభల్లో అవకాశాలు మెరుగుపడనున్నాయి. 33శాతం కంటే 50శాతం అమలు చేస్తే అందరికీ సమాన అవకాశాల ఇచ్చినట్లు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– అమురాజుల శ్రీదేవీ, మాజీ ఎమ్మెల్యే, బెల్లంపల్లి

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే గడ్డం వినోద్‌

బెల్లంపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ అన్నారు. గురువారం మున్సిపల్‌ కార్యాలయం ఆవరణలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేసిన సేవా కేంద్రాన్ని కలెక్టర్‌ సంతోష్‌, మున్సిపల్‌ కమిషనర్‌ మల్లారెడ్డి, చైర్‌పర్సన్‌ జక్కుల శ్వేతతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్‌ కార్యాలయంలో కేక్‌ కట్‌ చేశారు. మహిళా కౌన్సిలర్లకు కేక్‌ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

అన్ని రంగాల్లో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్‌ సంతోష్‌, వేదికపై ఎమ్మెల్యే వినోద్‌, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

- ప్రతీరోజు ప్రతీ పనిలో మహిళలు
- జిల్లా కలెక్టర్‌ బి.సంతోష్‌

మంచిర్యాలఅగ్రికల్చర్‌: కుటుంబాన్ని తీర్చిదిద్దడం నుంచి దేశాన్ని పాలించే వరకు అన్ని రంగాల్లో మహిళల పాత్ర కీలకమైనదని జిల్లా కలెక్టర్‌ బదావత్‌ సంతోష్‌ అన్నారు. గురువారం నస్పూర్‌ కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో కలెక్టర్‌ సంతోష్‌, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌, జిల్లా సంక్షేమశాఖ అధికారి చిన్నయ్య, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ సంతోష్‌ మాట్లాడుతూ లింగ భేదం లేకుండా అబ్బాయిలు, అమ్మాయిలను ఒకేలా చూస్తూ సమాన అవకాశాలు కల్పించాలని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా అధికారులు, ఉద్యోగులను ప్రశంసాపత్రాలతో సత్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శలు అందరినీ అలరించాయి. దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన మోటర్‌ సైకిళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.



డీపీఆర్‌వోను సత్కరిస్తున్న కలెక్టర్‌ సంతోష్‌

గులాబీ జెండా ఎగురడం ఖాయం

- బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌

నస్పూర్‌: త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి స్థానం గెలిచి గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ ధీమా వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని బీఆర్‌ఎస్‌ జిల్లా కార్యాలయంలో జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి స్థానాన్ని వరుసగా రెండు సార్లు కైవసం చేసుకున్నామని, ఈసారి గెలిచి హ్యాట్రిక్‌ సాధిస్తామని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌ మాట్లాడుతూ ఈ నెల 13న చెన్నూర్‌, 14 బెల్లంపల్లి నియోజకవర్గ కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తామని అన్నారు. సీఎం మానవ బాంబులు కాదు కదా తోక బాంబు కూడా పేల్చలేదని ఎద్దేవా చేశారు.



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్‌, పక్కన సుమన్‌

క్లుప్తంగా

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


సత్తయ్య మృతదేహం

లక్సెట్టిపేట: పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దౌడపల్లి గ్రామానికి చెందిన సొప్పరి సత్తయ్య (61) కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. గురువారం ఉదయం చెల్లంపేట సమీపంలోని పొలంవద్దకు వెళ్లి పొలానికి కొట్టే మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుని భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'గురుకులం'లో ప్రవేశానికి దరఖాస్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ శేరు శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బాలురకు 130, బాలికలకు 127 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఎంజేపీ ఆర్‌జేసీ సెట్ గడువు ఏప్రిల్ 12 వరకు ఉందని, 28 రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట విద్యార్థుల ఆందోళన

బెల్లంపల్లి: పరీక్షలు సరిగా రాయకుండా ప్రిన్సిపాల్ కట్టుదిట్టం చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తూ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఆందోళన చేపట్టారు. కళాశాల గేటు ఎదుట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి ఆందోళన చర్యలను నివారించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ నుంచి ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా తాము పరీక్షలు సజావుగా రాసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ పరస్పరం తాళ్లగురిజాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

లక్ష్యంతో పనిచేయాలి



మహిళలు తమ కంటూ ఒక లక్ష్యం ఏర్పర్చుకుని దానిని సాధించేందు కోసం పని చేయాలి. అప్పుడే సక్సెస్ అవుతాం. సింగరేణి ఉద్యోగంలో చేరడానికి మహిళలు ఏమాత్రం సంకోచించవద్దు. గనులపై కూడా మహిళలకు ప్రత్యేక రెస్టు హాల్స్ ఏర్పాటు చేయాలి.
– ఏ.అఖిల, సీనియర్ అసిస్టెంట్

మహిళల అభ్యున్నతికి కృషి



సింగరేణి కంపెనీ మహిళల అభ్యున్నతి కోసం కృషి చేస్తోంది. వృత్తి శిక్షణ కోర్సులు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నాం. వేలాది మంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకుని నేడు సొంత యూనిట్లు పెట్టుకొని ఆర్థికంగా రాణిస్తున్నారు. మహిళా శక్తి చాలా గొప్పది. ఆకాశమే హద్దుగా పని చేయాలి. దీనికి సింగరేణి అన్నిరకాల తోడ్పాటునందిస్తోంది.– బీ.రాధాకుమారి, సేవా అధ్యక్షురాలు, శ్రీరాంపూర్

నల్లనేలలో నారీ 'భేరి'

- సింగరేణిలో రాణిస్తున్న మహిళా ఉద్యోగులు
- కారుణ్య ఉద్యోగాలతో పెరిగిన మహిళల సంఖ్య
- పురుషులతో సమానంగా విధులు
- అన్నిరంగాల్లో చెరగని ముద్ర
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



శ్రీరాంపూర్: ఎంతో కష్టతరమైన సింగరేణి గనుల్లో కూడా మహిళలు తమ సత్తా చాటుతున్నారు. నింగి, నేల ఏదైనా సరే తమకు అవకాశం కల్పిస్తే పురుషులతో సమానంగా రాణిస్తామని నిరూపించుకుంటున్నారు. సింగరేణిలో కారుణ్య ఉద్యోగాలు మొదలైన తరువాత మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. చాలా మంది కార్మికులు తమ కొడుకుల స్థానంలో కూతుర్లకు డిపెండెంట్ ఉద్యోగం కల్పిస్తున్నారు. శ్రీరాంపూర్ డివిజన్‌లోనే సుమారు 215 మంది మహిళా ఉద్యోగులు పని చేస్తున్నారు. జీఎం కార్యాలయాల్లో, పలు డిపార్టుమెంట్లు, స్టోర్స్, వర్క్‌షాప్‌లలో, భూగర్భ గనులు, ఓసీపీల్లో విధులు నిర్వహిస్తున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కథనం.


వర్క్‌షాప్‌లో వైండింగ్ పనులు చేస్తున్న మహిళా ఉద్యోగులు (ఫైల్)

భయపడితే ఏదీ సాధించలేం



బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదివా. మా నాన్న స్థానంలో డిపెండెంట్ ఉద్యోగం కింద కంపెనీలో చేరా. ముందుగా ఇబ్బంది అనిపించినా నాకు నేనే ధైర్యం తెచ్చుకొని పని చేయడం మొదలు పెట్టాక అంతా తేలికైంది. అధికారులు సహకరిస్తున్నారు. మహిళలు ఎక్కడైనా ధైర్యంగా పనిచేయాలి. అప్పుడే అందరూ సహకరిస్తారు. భయపడితే ఏదీ సాధించలేం.
– బీ. సోని, బదిలీ వర్కర్, ఆర్కే 6 గని

వర్క్‌ని ఎంజాయ్ చేయాలి



వర్క్‌ని ఎంజాయ్ చేస్తూ పనిచేయాలి. అదే సమయంలో ఫైటింగ్ స్పిరిట్ కూడా ఉండాలి. అప్పుడే మహిళలు రాణిస్తారు. మూడేళ్లుగా సింగరేణిలో చేస్తున్నా. బయటివారికి సింగరేణిలో మహిళలు ఎలా ఉద్యోగం చేస్తారో అనిపిస్తుంది. మహిళలు భయపడితే ఏం సాధించలేరు. అడుగు ముందుకేస్తేనే ఏదైనా సాధించగలరు.
– కోదాటి ప్రియాంక, జనరల్ మజ్దూర్, జీఎం కార్యాలయం

డాక్టర్ చదివించడమే లక్ష్యంగా..

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన నిచ్చకోల స్వప్న, రాజన్న దంపతులకు హన్సిక ఒక్కరే సంతానం. పెళ్లైన తర్వాత పాపైనా బాబైనా ఒక్కరినే కనాలని నిర్ణయించుకున్నారు. హన్సిక జన్మించాక దంపతులు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకున్నారు. కుమార్తెను ఉన్నతస్థితికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎన్‌పీడీసీఎల్‌లో చిరు కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న రాజన్న వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఎన్నికష్టాలు వచ్చినా ఒక్కగానొక్క కూతుర్ని డాక్టర్ కోర్సు చదివించాలనుకున్నారు. 1 నుంచి పదోతరగతి వరకు బెల్లంపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో, ఇంటర్ హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కళాశాలలో చదివించారు. ప్రస్తుతం ఆమెకు నీట్‌లో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పిస్తున్నారు. ఎంబీబీఎస్ సీటు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. తమ కూతురు డాక్టరై పేదలకు వైద్యం అందించి తమ కుటుంబ గౌరవాన్ని ఇనుమడింపజేస్తుందని ఆ దంపతులు ఆశిస్తున్నారు.


కూతురు హన్సికతో స్వప్న, రాజన్న

యువతకు ఆదర్శం సాహితిరెడ్డి

తాంసి: మండల కేంద్రానికి చెందిన కంది గోవర్ధన్‌రెడ్డి, జయశ్రీ దంపతులకు కుమార్తె సాహితిరెడ్డి ఒక్కరే సంతానం. వారిది వ్యవసాయ కుటుంబం. కూతుర్ని ఉన్నతంగా చదివించాలని నిర్ణయించుకున్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు రాంపూర్‌లోని ప్రైవేట్ పాఠశాలలో, 8 నుంచి పదో తరగతి వరకు హైదరాబాద్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో, ఇంటర్ హైదరాబాద్‌లోని చైతన్య కళాశాలలో చదివించారు. నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన సాహితిరెడ్డి వరంగల్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. ఎంబీబీఎస్ పూర్తి కావడంతో ప్రస్తుతం జనరల్ సర్జన్ పరీక్షకు సన్నద్ధమవుతోంది. తల్లిదండ్రుల లక్ష్యం నేరవేరుస్తున్న సాహితిరెడ్డి నేటి యువత, మహిళలకు ఆదర్శంగా నిలుస్తోంది. యువత అవకాశాలు అందిపుచ్చుకుని అన్నిరంగాల్లో ముందుకెళ్లాలని సూచిస్తోంది.


తల్లిదండ్రులు గోవర్ధన్‌రెడ్డి, జయశ్రీతో సాహితిరెడ్డి

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో...


కూతురు సంగీతతో ప్రహ్లాద్

సిరికొండ: మండలంలోని రాంపూర్(బి) గ్రామానికి చెందిన సూర్యవంశి ప్రహ్లాద్, బాగుబాయి దంపతులకు కుమార్తె సంగీత ఒక్కరే సంతానం. చిన్ననాటి నుంచి సంగీత చదువులో ముందుండేది. పెద్దయ్యాక ఏంచేస్తావ్ అని అడిగితే డాక్టర్ అవుతానని చెప్పేది. కూతురు చిన్ననాటి మాటలను నిజం చేయాలని ఆ దంపతులు నిర్ణయించుకున్నారు. 1నుంచి పదో తరగతి వరకు ఇంద్రవెల్లి మండలంలోని దన్నాడ ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్ హైదరాబాద్‌లోని చైతన్య కళాశాలలో, నీట్‌లో ప్రతిభ కనబరిచి ఫిలిప్పీన్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. గతేడాది నుంచి ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే వైద్యవిద్య పూర్తిచేశానని పేర్కొంది.

కూతురు మాటే వేదవాక్కు

వేమనపల్లి: కొడుకులు లేని ఆ దంపతులకు కూతురు మాటే వేదవాక్కు. జెడ్పీటీసీ రుద్రభట్ల స్వర్ణలత, ఎంపీటీసీ సంతోష్ కుమార్ దంపతులకు ఏకైక సంతానం కుమార్తె స్మృతి. గారాల పట్టి నిర్ణయాలే ఆ ఇంట్లో వేదవాక్కు. ఏ శుభకార్యం చేయాలన్నా.. కొత్తగా ఏ పనులు ప్రారంభించాలన్న ఆమె చేతుల మీదుగానే ప్రారంభిస్తారు. చిన్నప్పటి నుంచి అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. ప్రస్తుతం స్మృతి చెన్నూర్‌లోని ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఆమె పుట్టినరోజున పేదలకు అన్నదానం, ఆర్థికసాయం చేస్తున్నారు.


స్మృతితో స్వర్ణలత, సంతోష్

ఒక్కరే ముద్దు..

దండేపల్లి: ప్రస్తుత రోజుల్లో ఆడైనా మగైనా ఒక్క సంతానమే మంచిదని అంటున్నారు దండేపల్లికి చెందిన గడ్డం రమేశ్‌గౌడ్, ప్రశాంతి దంపతులు. వారికి ఏకైక సంతానంగా శిఖర జన్మించింది. పుట్టింది ఆడపిల్ల అయినా ఒక్క సంతానంతోనే సరిపెట్టుకున్నారు. చిన్నారిని ఎంతో ఆప్యాయంగా, అల్లారు ముద్దుగా పెంచుతున్నారు. అంతే కాకుండా బాగా చదివించి ఉన్నత స్థానంలో నిలపాలన్నదే లక్ష్యం అంటున్నారు.


కూతురు శిఖరతో రమేశ్‌గౌడ్, ప్రశాంతి

సమాజంలో గుర్తింపు ఉండాలని..



లక్సెట్టిపేట: 2002లో లా డిగ్రీ పూర్తిచేశా. 2005లో వ్యాపారవేత్త అనిల్‌కుమార్‌తో వివాహమైంది. మాకు ఇద్దరు సంతానం. సమాజంలో తమకంటూ గుర్తింపు ఉండాలని కుటుంబ సభ్యులు, భర్త ప్రోత్సాహంతో పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యా. 2012లో పబ్లిక్ ప్రాసిక్యూటర్, 2013లో జూనియర్ సివిల్ జడ్జి అయ్యా. 2022లో సీనియర్ సివిల్ సివిల్ జడ్జిగా ప్రమోషన్ వచ్చింది.
– అర్పిత మారంరెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి

ఏప్రిల్ 28న గురుకుల డిగ్రీ ప్రవేశ పరీక్ష

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి ఏప్రిల్ 28న పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ శేరు శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మంచిర్యాల డిగ్రీ కళాశాలలో ప్రతీ కోర్సుకు 40 సీట్లు ఉన్నాయని, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. mjptbcwreis..telangana.gov.in లోకానీ tsrdccet. cgg. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జేసీఎల్‌ను కలిసిన పవర్ ప్లాంట్ కార్మికులు


జేసీఎల్‌తో సమావేశమైన కార్మికులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని శాలివాహన పవర్ ప్లాంట్ కార్మికులు గురువారం వరంగల్‌లోని జాయింట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో జేసీఎల్ సునీతతో సమావేశమయ్యారు. కార్మికులకు రావాల్సిన బకాయిలు, పెండింగ్ వేతనాలు, కంపెనీ క్లోజింగ్ బెనిఫిట్‌లు యాజమాన్యం ఇవ్వకపోవడంతో 15 నెలలుగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ నెల 15న కార్మికులు, యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేస్తామని జేసీఎల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మద్దూరి రాజు, పవర్ ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, సత్యనారాయణ, ఆనందరావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి


మహిళలను సన్మానిస్తున్న జీఎం దంపతులు

- జీఎం బీ. సంజీవరెడ్డి
- ఘనంగా మహిళా దినోత్సవం

శ్రీరాంపూర్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో గురువారం శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా రాణించాలన్నారు. ధైర్యంగా ముందుకెళ్లి తమకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చాలా మంది మహిళలు కుటుంబ బాధ్యతలు మోస్తూనే కంపెనీలను దిగ్విజయంగా నడిపిస్తున్నారన్నారు. జీఎం సతీమణి, ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి మాట్లాడుతూ సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో అనేక వృత్తి కోర్సులు ఏర్పాటు చేసి మహిళలను ప్రయోజకులను చేస్తున్నామన్నారు. ఇందులో శిక్షణ పొందిన చాలా మంది మహిళలు స్వంత యూనిట్లు పెట్టుకొని ఆర్థికంగా రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ మహిళలను జీఎం దంపతులు సన్మానించి జ్ఞాపిక అందించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంజీవరెడ్డి కేక్ కట్ చేసి మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్, డీజీఎం అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, సేవా సెక్రెటరీ కొట్టె జ్యోతి, సభ్యులు తిరుమల, మంగ, సునీత, భారతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ సెక్రటరీ ఎస్కె బాజీసైదా గని మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు క్వారీలో వెళ్లేందుకు సరిపడా వాహన సౌకర్యం కల్పించాలని, దుమ్ము, ధూళి లేవకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, జాయింట్ సెక్రెటరీ చంద్రమోహన్, జీఎం కమిటీ చర్చల కమిటీ ప్రతినిధి బద్రి బుచ్చన్న పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


వినతిపత్రం ఇస్తున్న ఎన్‌హెచ్‌ఎంలు

మంచిర్యాలఅగ్రికల్చర్: నేషనల్ హెల్త్ స్కీమ్‌లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ, ఆర్‌బీఎస్‌కే డాక్టర్స్, రెండో ఏఎన్‌ఎం, డీఈఈసీలకు మూడునెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం డీఎంహెచ్‌వో సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ పేద, మధ్యతరగతికి చెందిన వారేనని, వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బాపు, రాజు, అప్సర, ప్రతిజ్ఞ, మహేందర్, ప్రవళిక, సందీప్, నవ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.